# జొన్న..లాభాలు మిన్న!

- పంటసాగుపై రైతుల మక్కువ
- మార్కెట్‌లో గిట్టుబాటు ధర

**కుంటాల:** ఆరుతడి పంటల్లో రైతులు సాగు చేసే పంట జొన్న. చిరుధాన్యాల్లో అధికంగా యాసంగిలో సాగుచేసే జొన్న ఆహారంగా, పశువులకు మేతగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రజలు జొన్న రొట్టెలు తినడంతో మార్కెట్‌లో వీటికి డిమాండ్ పెరిగింది. జొన్నసాగుకు రైతులు మక్కువ చూపుతున్నారు. మండలంలోని గతేడాది 2,650 ఎకరాల్లో రైతులు జొన్న సాగు చేయగా, ఈసీజన్‌లో 6,234 ఎకరాల్లో సాగుకు శ్రీకారం చుట్టారు. ఏడాదికి పోలిస్తే యాసంగిలో రెట్టింపు స్థాయిలో సాగు చేశారు. వేడి, తేమ పొడి వాతావరణంలో పెరిగే పంట జొన్న. తక్కువ నీటి వినియోగంతో 90 రోజుల్లో పంట చేతికొచ్చి అధిక దిగుబడి రావడంతో యాసంగిలో గతేడాది నుంచి రైతులు సాగుపై దృష్టిసారించారు. అడవి జంతువులు, పక్షులు, తెగుళ్ల బెడద లేకపోవడం కూడా సాగుకు వరమైంది. ఎకరాకు సుమారు 25 క్వింటాళ్ల నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావడంతో మండలంలోని రైతులు ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు.



కల్లూరులో సాగవుతున్న జొన్న

**గిట్టుబాటు ధర**

ప్రభుత్వం గతేడాది నుంచి జొన్నల కొనుగోళ్లు చేపట్టి గిట్టుబాటు ధర కల్పించింది. ఇందులో భాగంగా పెంచికల్‌పాడ్, కల్లూరు, కుంటాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాల్‌కు రూ.3,180 గిట్టుబాటు ధర కల్పించింది. ప్రస్తుతం మండలంలోని కల్లూరు, పెంచికల్‌పాడ్, లింబా(కే), ఓలా, కుంటాల, అందాకూర్, నర్సాపూర్(జి) మండలం గొల్లమాడలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇటీవల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రభుత్వం ఈసారి క్వింటాల్ రూ.3,371 ధర నిర్ణయించారు. గతేడాది కంటే క్వింటాల్‌కు రూ.191 అదనంగా చెల్లించడంతో రైతులు జొన్నసాగుపై ఆసక్తి చూపారు. కాగా, కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

### ఈసారి ధర ఉంది



గ్రామాల్లో ప్రతి ఇంటా జొన్న రొట్టెలు తినడం ప్రారంభించారు. దీంతో జొన్నలకు డిమాండ్ పెరిగింది. ఈసారి జొన్న పంట సాగు చేశా. ధర మంచిగా ఉంది. – ఈసారం రాజేశ్వర్, రైతు, అందాకూర్

### రెండేళ్లుగా సాగు చేస్తున్నా..



గత రెండేళ్లుగా రెండున్నర ఎకరాల్లో జొన్నలు సాగు చేస్తున్నా. సుమారు 50 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. కొనుగోళ్లను త్వరగా ప్రారంభించాలి.

– రమాకాంత్‌రావు, రైతు, కల్లూరు

### రెట్టింపు సాగు



ప్రభుత్వం జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించింది. గతేడాది కంటే రైతులు రెట్టింపుగా సాగు చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలి.

– సట్ల గజ్జారాం, పీఏసీఎస్ చైర్మన్, కుంటాల

## రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**లక్ష్మణచాంద:** రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కేంద్రాల వద్ద చర్యలు చేపట్టాలని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చామన్‌పెల్లిలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం, లక్ష్మణచాందలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు నాలుగు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద వసతులు సమకూర్చాలని నిర్వాహకులను ఆదేశించారు. తాగునీరు, టెంట్ సౌకర్యం, వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం తీసుకువచ్చిన వెంటనే తేమ రాగానే రైతులకు సంచులు ఇచ్చి తూకం వేయాలన్నారు. ఆ తర్వాత వారికి రశీదు అందించాలన్నారు. తహసీల్దార్ జానకి, ఏపీఎం వాణిశ్రీ, ఏవో వసంత్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు చిన్నయ్య, నాయకులు రమేశ్, రాజు, జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



లక్ష్మణచాందలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

**పేదల సంక్షేమానికి కృషి**

**దిలావర్‌పూర్:** పేదల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాంగ్వి గ్రామంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.2.50లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ నుంచి రూ.2.50 లక్షల నిధులతో ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమేనని, చేతల్లో ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. మాజీ సర్పంచ్ అచ్చుత్‌రావు, నాయకులు రాంరెడ్డి, దశరథ్‌రెడ్డి, మహబూబ్, రమేశ్, ముత్యం, నిరంజన్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**సారంగాపూర్:** రైతులు పండించిన జొన్నలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చించోలి(బి), బోరిగాం, మలక్‌చించోలి, బీరవెల్లి, స్వర్ణ గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాల్ రూ.3371 నిర్ణయించిందన్నారు. అనంతరం పెండల్‌దరిలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కాల్వ నరేశ్, పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డి ఉన్నారు.

**కార్యకర్తలకు అండగా ఉంటా..**

తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వంజర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త తాటిపత్రి మనోహర్‌కు రూ.9.55లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును శుక్రవారం ఆయన ఇంటికి వెళ్లి అందజేశారు. ఇటీవల మనోహర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. వైద్యంకోసం రూ.15 లక్షల పైచిలుకు ఖర్చయింది.

## క్లుప్తంగా

### కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



మునిపెల్లిలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి

**లక్ష్మణచాంద:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని నిర్మల్ ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి సూచించారు. చింతల్‌చాంద, మునిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజేశ్వర్ పాల్గొన్నారు.

**మామడ:** పొన్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి ప్రారంభించారు. సెర్ప్ ఏపీఎం అరుణ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, గంగారెడ్డి, భూమేశ్వర్, లింగన్న, శేఖర్, నర్సారెడ్డి, ముత్యంరెడ్డి, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే కొరిటికల్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సీఈవో గంగారాం, డైరెక్టర్ చిన్నారెడ్డి, నాయకులు బాపురెడ్డి పాల్గొన్నారు.

**లోకేశ్వరం:** ధర్మోర, వట్టోలి, అబ్దుల్లాపూర్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతాన్ని డీపీఎం రాజేశ్వర్ పరిశీలించారు. ఏపీఎం మల్లేశ్, సీసీ శ్రీనివాస్ ఉన్నారు.

### ఇద్దరి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్




మహిళతో కానిస్టేబుల్ మోహన్ సింగ్

**బాసర:** బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఇద్దరు మహిళలను కాపాడి కుటుంబ సభ్యులకు కానిస్టేబుల్ మోహన్‌సింగ్ అప్పగించాడు. శుక్రవారం తన విధుల్లో భాగంగా గోదావరి నది నిజామాబాద్ వైపు విధులు నిర్వహిస్తున్నాడు. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం కోస్లికి చెందిన బండారి లక్ష్మి, నవీపేటకు చెందిన సాయమ్మ ఇంట్లో కుటుంబ సమస్యల కారణంగా గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించగా కానిస్టేబుల్ వారికి ధైర్యం చెప్పి, పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు.

### గుండంపల్లిలో ఆకస్మిక తనిఖీలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్సై సందీప్

**దిలావర్‌పూర్:** మండలంలోని గుండంపల్లిలో నిర్మల్ రూరల్ సీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల వస్తున్న ఫిర్యాదుల ఆధారంగా గ్రామంలో పలు కిరాణా షాపులు, కల్లు బట్టీలను తనిఖీ చేసినట్లు దిలావర్‌పూర్ ఎస్సై సందీప్ తెలిపారు. గంజాయి మత్తులో యువత ఆయా గ్రామాల్లో వీరంగం సృష్టిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వీరిపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. గంజాయిని విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మట్కా జూదరుల అరెస్ట్

**భైంసాటౌన్:** పట్టణంలో మట్కా ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. మదీనాకాలనీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంతంలో పలువురు మట్కా ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు శుక్రవారం దాడి చేసినట్లు పేర్కొన్నారు. నయాబాది, మహ్మదియానగర్, మార్కెట్ ఏరియాకు చెందిన ముగ్గురు పట్టుబడగా, వారి నుంచి రూ.1600 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మరికొందరు పరారీలో ఉన్నారని, ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**పెంబి:** వానాకాలం సాగుకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఏవో నవీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఏఈవో రాజ్‌కుమార్ ఉన్నారు.

### నేడు కుంటాలకు కలెక్టర్

**కుంటాల:** స్థానిక రైతువేదికలో శనివారం భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ అభిలాష అభినవ్ రానున్నట్లు తహసీల్దార్ కమల్‌సింగ్ తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు.

## ప్రజల గుండెల్లో బీఆర్ఎస్

- నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్

**కడెం:** ప్రజాహితమైన సంక్షేమ పథకాలు, మెరుగైన పాలనతో బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో గుండెల్లో నిలిచిపోయిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ అన్నారు. ఖానాపూర్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం కడెం మండలంలోని ఉడుంపూర్, నర్సాపూర్ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ తుఫాన్ వేగంతో అధికారంలో రావడం ఖాయమన్నారు. వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, మల్లారెడ్డి, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

**వంటషెడ్ల నిర్మాణానికి భూమిపూజ**

**ఖానాపూర్:** మండలంలోని బీర్నంది గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయంతోపాటు రంగపేట గ్రామంలోని లక్ష్మీదేవి ఆలయాల్లో వంట షెడ్ల నిర్మాణ పనులకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ శుక్రవారం భూమిపూజ చేశారు. అంతకుముందు రంగపేటలోని బీఆర్ఎస్ కార్యకర్త పాలాస రవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాదనకుర్తిలో ఇటీవల మృతిచెందిన స్వామి గౌడ్‌తోపాటు సుర్జాపూర్ గ్రామానికి చెందిన సంగర్తి గంగవ్వ కుటుంబీకులను ఓదార్చారు. నాయకులు వాల్‌సింగ్, లక్ష్మణ్‌రావు, గోపాల్, నవీన్, భూమేశ్, రాజన్న, సరోజ, రాకేశ్, మహిపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న జాన్సన్‌నాయక్

## భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారం

**తానూరు:** భూభారతి చట్టంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ లింగంమూర్తి తెలిపారు. మండలంలోని బోరిగాం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెలలో రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకుని ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తారన్నారు. గతంలో జిల్లా కలెక్టర్‌కు మాత్రమే అధికారం ఉండేదని, ఇప్పుడు తహసీల్దార్, ఆర్డీవోకు అవకాశం కల్పించారన్నారు. నాయకులు చంద్రకాంత్ యాదవ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**కుంటాల:** భూభారతితో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. మండలంలోని అంబకంటి, రాయపాడ్ తండాలో భూభారతి చట్టంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆర్ఐలు అడెల్లు, రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి సుమన్, జూనియర్ అసిస్టెంట్ విశాల్, మాజీ సర్పంచ్ ప్రదీప్ కుమార్, నాయకులు వెంగల్‌రావు, శేఖర్‌రావు, గజ్జారాం, సంతోష్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ కమల్‌సింగ్

**నర్సాపూర్(జి):** గొల్లమాడ, నసీరాబాద్ గ్రామాల్లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. గొల్లమాడ మాజీ సర్పంచ్ చెన్న మహేశ్, ఆర్ఐలు సుమలత, నవత జ్యోతి, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

**దస్తురాబాద్:** గోడిసీర్యాలలో భూభారతి చట్టంపై డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతుల భూ సమస్యలను అధికారులు పరిశీలించి వారి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్తి, మధు, రైతులు పాల్గొన్నారు.

### విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి



ఏఈని నిలదీస్తున్న కాలనీవాసులు

**ముధోల్:** మండలకేంద్రంలోని నాయాబాదికి చెందిన కాలనీవాసులు శుక్రవారం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండేళ్లుగా పలుమార్లు ఫిర్యాదు చేసినా పరిష్కరించడం లేదని వాపోయారు. అక్కడే ఉన్న ఏఈ శ్రీకాంత్‌ను నిలదీశారు. లోవోల్టేజీతో ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. సమస్య ఉన్న ప్రాంతానికి వచ్చి పర్యవేక్షించాలని లేకపోతే రోడ్డుపై బైఠాయిస్తామన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు సాయం

**కుంటాల:** మండలంలోని ఓలా గ్రామంలో అగ్నిప్రమాదం సంభవించడంతో వేల్పూర్ రాజశేఖర్, రాకేశ్, రంజిత్‌లకు చెందిన వడ్రంగి షెడ్లు కాలిబూడిదయ్యాయి. ఓలాలోని శ్రీ వాసర సరస్వతి శిశు మందిర్ ప్రిన్సిపాల్ లోలం గజానంద్ రూ.20వేల నగదును శుక్రవారం బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనీస్ ఫాతిమా, మాజీ ఉప సర్పంచ్ సదాశివ్ పటేల్, ఏఎంసీ డైరెక్టర్ సాయినాథ్, ఆనందిత ఫౌండేషన్ చైర్మన్, మోటివేషనల్ స్పీకర్ లక్ష్మణ్, సాయికుమార్ పాల్గొన్నారు.

### ఘనంగా మలేరియా దినోత్సవం

**లక్ష్మణచాంద:** మండలంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని తెలిపారు.

### సద్వినియోగం చేసుకోవాలి

**భైంసాటౌన్:** భైంసా డివిజన్‌లోని మాదిగ యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ఈనెల 26న చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని బాసర రోడ్‌లోగల ఆర్‌జెడ్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకుడు, ఫారెస్ట్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి గంగాధర్ కోరారు.

### అమ్మవారిని దర్శించుకున్న ఎస్సై

**బాసర:** శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని నూతన ఎస్సై సంజీవ్ కుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఎస్సై దంపతులను అర్చకులు సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ చైర్మన్ శరత్ పాటక్ ఉన్నారు.

## ఉగ్రదాడిపై నిరసన



భైంసాటౌన్: కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన



నిర్మల్‌లో న్యాయవాదుల నిరసన

**భైంసాటౌన్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద ఉగ్రవాద దాడిని ఖండిస్తూ పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. కోర్టు ఆవరణ నుంచి గేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. న్యాయవాదులు సి.శంకర్, మురళీధర్, సంతోష్ కులకర్ణి, దేవిదాస్ హస్బే, తాడేవార్ సాయినాథ్, రవి పాండే, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

- భైంసాలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం రాత్రి నిరసన తెలిపారు. బస్టాండ్ ఎదురుగా గల అంబేద్కర్ విగ్రహం వద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. విలాస్ గాదేవార్, రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, శ్యాంసుందర్ ఉన్నారు.

**ఖానాపూర్/నిర్మల్‌టౌన్:** ఖానాపూర్ కోర్టులో బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో, జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు.

- ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని గుల్జార్ మసీద్‌లో ముస్లిం మైనార్టీలు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు.

**లక్ష్మణచాంద:** ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లింలు ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఆ దాడిలో మృతిచెందినవారికి మండల కేంద్రంలోని మసీదులో ప్రత్యేక ప్రార్థనల అనంతరం శ్రద్ధాంజలి ఘటించారు.

**దస్తురాబాద్:** ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి మండల కేంద్రంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టి నివాళులర్పించారు. నాయకులు, యువకులు ఉన్నారు.

**ఖానాపూర్/లక్ష్మణచాంద:** ఉగ్రదాడిని ఖండిస్తూ ఖానాపూర్‌లో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. లక్ష్మణచాందలో ప్రశాంతంగా కొనసాగింది. అన్ని వ్యాపార సముదాయాలు, కిరాణాషాపులు మూసివేశారు. ఖనాపూర్‌లో ర్యాలీ నిర్వహించారు.

**మామడ:** ఉగ్ర దాడిని ఖండిస్తూ పొన్కల్ గ్రామంలో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

## సంక్షిప్తంగా

**పశువులకు గాలికుంటు నివారణ టీకాలు**

**ఖానాపూర్:** జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండలంలోని దిలావర్‌పూర్‌లో శుక్రవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశు వైద్యాధికారి సౌందర్య ఆదేశాలతో సిబ్బంది పశువులకు టీకాలు వేశారు.

**ఆర్థికసాయం**

**ఖానాపూర్:** పట్టణానికి చెందిన ఎస్.రాజేశ్వర్ కుమారుడు సాయిప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై నిర్మల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుటుంబసభ్యుల విన్నపం మేరకు ఓకేఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఖానాపూర్ వాసి కృష్ణంరాజు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

**ప్రైవేట్ ఉపాధ్యాయుడికి చేయూత**

**నిర్మల్‌టౌన్:** జిల్లాకేంద్రంలోని భాగ్యనగర్‌లో నివాసం ఉంటున్న ప్రైవేట్ ఉపాధ్యాయుడు శ్యామ్ మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ సభ్యులు.. వాసవి వరల్డ్ స్కూల్ కరస్పాండెంట్ జగదీశ్వర్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని శుక్రవారం శ్యామ్‌కు అందజేశారు. క్రాంతికుమార్, రామ్‌చందర్, తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాలల్లో గ్రాడ్యుయేషన్ డే**

**ఖానాపూర్:** పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులకు తల్లిదండ్రుల సమక్షంలో సూపర్‌వైజర్ శ్యామల అసెస్‌మెంట్ కార్డులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి ఉన్నారు.

**నిర్మల్‌టౌన్:** జిల్లా కేంద్రంలోని విజయ హై స్కూల్‌లో యూకేజీ విద్యార్థులకు శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. పాఠశాల జనరల్ సెక్రెటరీ అయ్యన్నగారి భూమయ్య, వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరస్పాండెంట్ నాగభూషణం, ట్రెజరర్ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ విజయలక్ష్మి, ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కవులకు సన్మానం**

**మామడ:** మామడ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శంకర్‌ను శుక్రవారం మండల వాసులు సన్మానించారు. ప్రముఖ కవిగా గుర్తింపు పొందిన శంకర్, జిల్లా కేంద్రానికి చెందిన మరో కవి వెంకట్‌తో కలిసి ఖమ్మం కవియాత్రను విజయవంతం చేశారని, తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్య పర్చడం అభినందనీయమన్నారు. ఎస్సై అశోక్, యువకులు ఉన్నారు.

**ర్యాలీ, సభను విజయవంతం చేయాలి**

**కడెం:** నారాయణపేట్ జిల్లా మరికల్ మండల కేంద్రంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘ ర్యాలీ, సభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు డాకురి తిరుపతి, ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ర్యాలీ, సభ కరపత్రాలను ఆవిష్కరించారు. ఇందులో జిల్లా నాయకులు రాజేశ్, నర్సయ్య ఉన్నారు.

## రోడ్లపై ఆక్రమణల తొలగింపు

**భైంసాటౌన్:** పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారాలను పోలీసులు, మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద, బస్టాండ్ ప్రధాన రహదారి వెంబడి రోడ్డు పక్కన చిరువ్యాపారాలతోపాటు, దుకాణాల ఎదుట ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగింపజేశారు. దుకాణదారులు రోడ్డు ఆక్రమించేలా సామగ్రి పెట్టవద్దని, చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించేలా ఏర్పాటు చేసుకోవద్దని సీఐ గోపినాథ్ సూచించారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ టీపీవో అనురాధ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనీస్ ఉన్నారు.



తొలగింపజేస్తున్న సీఐ గోపినాథ్

### బాసర ఆలయ రికార్డ్ అసిస్టెంట్‌గా మాధురి



నియామకపత్రం అందజేస్తున్న ఆలయ ఈవో

**బాసర:** బాసర శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయంలో తమ్మలి నర్సయ్య చాలాఏళ్లుగా సన్నాయిని వాయిద్యకారుడిగా విధులు నిర్వహించాడు. ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో ఆయన కూతురు మాధురికి కారుణ్య నియామకం ద్వారా రికార్డు అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. ఈమేరకు ఈవో సుధాకర్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు.

### జడ్జికి సన్మానం



సన్మానిస్తున్న న్యాయవాదులు

**నిర్మల్‌టౌన్:** నిర్మల్ కోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్.అజయ్ కుమార్ ఇటీవల ఆలేరు కోర్టుకు బదిలీ అయ్యారు. దీంతో న్యాయవాదులు కోర్టు కార్యాలయంలో శుక్రవారం సన్మానించి మెమెంటో అందజేశారు. ఇందులో న్యాయవాదులు రాజశేఖర్, రమణగౌడ్, మహేందర్, సిరాజ్, రాజేశ్, వినోద్, రఘు తదితరులు పాల్గొన్నారు.

### జౌలా రోడ్డుకు మరమ్మతు



సాక్షి స్పందన

**తానూరు:** తానూరు నుంచి జౌలా(బి) గ్రామానికి ఉన్న బీటీ రోడ్డుపై అక్కడక్కడ గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై ఇటీవల సాక్షిలో రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టండి శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు.. తానూరు శివారు నుంచి జౌలా(బి) వరకు ఉన్న గుంతలను పూడ్చివేశారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తొలగిపోయాయి.

### ఆలయ వార్షికోత్సవం

**మామడ:** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండితుడు చంద్రశేఖర శర్మ వేదమంత్రోచ్చరణాలతో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.